THE తెలంగాణ మిర్రర్

ఆదివారం 14.06.2026 | epaper. thetelanganamirror.in | పేజీలు : 2 | మార్నింగ్ ఎడిషన్ | Editor : Kandarapu Rameshacharyulu

## మిర్రర్ కథనాన్ని వీక్షించి మానవత్వం చాటిన

# తహశీల్దార్ వా(భో)ణీ కొట్టిన వైనం

### చిన్నారి స్నిగ్ధ అకౌంట్ కు రూ.10వేలు ఆన్ లైన్ లో నగదు ట్రాన్స్ ఫర్

**కన్నీటి కథనంతో కదిలిన మానవతా హృదయాలు**

**క్యాన్సర్‌తో పోరాడుతున్న రజనీకి చేయూతగా ముందుకొస్తున్న దాతలు**

**వాణిరెడ్డి బోణీతో మొదలైన సాయం...**

**చిన్నారుల భవిష్యత్తుకు భరోసాగా మారుతున్న మానవత్వం**

**ది తెలంగాణ మిర్రర్ కథనానికి విశేష స్పందన**



అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ యువ నేత కర్ర రవీందర్, క్యాన్సర్‌తో మృత్యు తో పోరాడుతున్న భార్య రజని ఇద్దరు చిన్నారుల దృశ్యం (ఫైల్)



THE తెలంగాణ మిర్రర్

నాన్న మృత్యువుకు బలి..

అమ్మ క్యాన్సర్‌తో పోరాటం

ఆ ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు భరోసా ఎవరు..- అలిగిరెడ్డి అభయం... పొన్నం పరామర్శ

కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేసిన కార్యకర్త కుటుంబం ఆపదలో

పార్టీ నేతలు స్పందించరా..? మానవతా హృదయాలు కరగరా..?

హుస్నాబాద్,జూన్13(ది తెలంగాణ మిర్రర్):

ఒకవైపు తండ్రి మరణం... మరోవైపు తల్లి క్యాన్సర్‌తో మృత్యువుతో పోరాటం... మధ్యలో భవిష్యత్తు ఏమవుతుందో తెలియక కన్నీటి సంద్రంలో ...

దహన సంస్కారాల ఖర్చు భరిస్తానని తన అనుచరులకు సూచించినట్లు సమాచారం. అంతేకాకుండా పిల్లల చదువు బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కార్యకర్తల పట్ల ఆయన చూపుతున్న మానవీయ దృక్పథాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

పరామర్శలకే పరిమితమైందా..?

రవీందర్ రెడ్డి మరణించిన దాదాపు ఇరవై రోజుల తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు స్పష్టమైన సహాయం అందలేదని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం జెండా మోసిన సామాన్య కార్యకర్తలు ఆపదలో ఉన్నప్పుడు పార్టీ అండగా నిలుస్తుందా లేదా అన్న ప్రశ్నలు ఇప్పుడు కార్యకర్తలలో చర్చనీయాంశంగా మారాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన అనేక మంది కార్యకర్తలు ...

తండ్రి మరణించగా, తల్లి క్యాన్సర్‌తో మంచానికే పరిమితమైంది. చిన్న వయసులోనే జీవితపు కఠిన వాస్తవాలను ఎదుర్కొంటున్న స్నిగ్ధ, శ్రీతన్‌లు భవిష్యత్తుపై ఆందోళనతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడి పనిచేసిన కార్యకర్త కుటుంబం నేడు దిక్కుతోచని స్థితిలో ఉండటం స్థానికులను కలచివేస్తోంది.

అలిగిరెడ్డి అండ... కుటుంబానికి భరోసా

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి గతంలో రవీందర్ చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించారు. రవీందర్ మరణించిన తర్వాత కూడా ...

మిర్రర్ లో ప్రచురితమైన వాస్తవిక కథనం(క్లిప్పింగ్)

**హుస్నాబాద్,జూన్13(ది తెలంగాణ మిర్రర్):**

**"నాన్న మృతి... అమ్మకు క్యాన్సర్... ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు భరోసా ఎవరు..?" అంటూ (ది తెలంగాణ మిర్రర్) నిన్నటి ఈవెనింగ్ ఎడిషన్ లో ప్రచురించిన హృదయ విదారక కథనం మానవతా హృదయాలను కదిలించింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్ర రవీందర్ రెడ్డి మరణం, ఆయన భార్య రజనీ క్యాన్సర్‌తో మృత్యువుతో పోరాడుతున్న దుస్థితి, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి గురించి వెలుగులోకి తీసుకురావడంతో అనేక మంది దాతలు, మానవతావాదులు స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వస్తున్నారు. కథనం ప్రచురితమైన వెంటనే పలువురు సామాజికవేత్తలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు కుటుంబ పరిస్థితిపై ఆరా తీసి తమవంతు సహాయాన్ని అందించేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా గతంలో హుస్నాబాద్ తహసీల్దారుగా పనిచేసిన వాణిరెడ్డి స్పందించి తొలి ఆర్థిక సహాయాన్ని అందించడం విశేషంగా నిలిచింది.**

**తహశీల్దార్ వాణిరెడ్డి బోణీతో మొదలైన మానవత్వం**

కుటుంబ పరిస్థితిని వాస్తవిక కోణంలో కండ్లకు గట్టినట్టుగా కథనం ప్రచురించిం(ది)తెలంగాణ మిర్రర్.. ఈ నేపథ్యంలో ఈ కథనాన్ని సదరు తహశీల్దార్ వాణి రెడ్డి హృదయం స్పందించింది. రవీందర్ రెడ్డి కూతురు స్నిగ్ధ ఎకౌంటుకు ఆన్లైన్ ద్వారా పదివేల రూపాయలు ట్రాన్స్ఫర్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె అందించిన ఆర్థిక సహాయం ఇతరులకు స్ఫూర్తిగా నిలవడంతో మరికొందరు దాతలు కూడా ముందుకు రావడం ప్రారంభించారు.ఒక కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకుని స్పందించడం గొప్ప విషయం అయితే, మొదటి అడుగు వేయడం ఇంకా గొప్ప విషయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వాణిరెడ్డి ప్రారంభించిన ఈ చేయూత మరింత మందిలో దాతృత్వాన్ని మేల్కొల్పిందని గ్రామస్తులు చెబుతున్నారు.

**మిర్రర్ కథనానికి విశేష స్పందన**

ది తెలంగాణ మిర్రర్ ప్రచురించిన కథనం సోషల్ మీడియా వేదికలతో పాటు వివిధ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. కుటుంబ పరిస్థితి తెలిసిన వెంటనే అనేక మంది ఫోన్ ద్వారా సంప్రదించి సహాయం చేయాలనే ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రిని కోల్పోయి, తల్లి క్యాన్సర్‌తో మంచానికే పరిమితమైన నేపథ్యంలో ఇద్దరు చిన్నారుల చదువు, వైద్యం, భవిష్యత్తుపై ఆందోళన చెందిన మానవతావాదులు స్పందించడం ఆశాజనక పరిణామమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

**మానవత్వానికి నమస్కారం**

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి చేయూత అందించేందుకు ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికీ మృతుడు కర్ర రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ బాధను సమాజానికి తెలియజేసి, మానవతా హృదయాలను స్పందింపజేసిన'(ది)తెలంగాణ మిర్రర్ యాజమాన్యానికి, చీఫ్ ఎడిటర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**ఇంకా సహాయం అందించవచ్చు**

రజనీ ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స పొందుతుండగా, ఇద్దరు చిన్నారుల విద్యాభవిష్యత్తు కోసం ఇంకా ఆర్థిక సహాయం అవసరమని కుటుంబ సభ్యులు తెలిపారు. మానవతా హృదయాలు కలిగిన దాతలు నేరుగా కుటుంబానికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**సహాయం చేయదలచిన వారు**

**యూకో బ్యాంక్, హుస్నాబాద్ బ్రాంచ్**

**ఖాతా సంఖ్య: 0700321105334**

**ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూసీబీఏ 0000700 కు ఆర్థికంగా చేయుతనివ్వవచ్చు.**

"ఒక కథనం కన్నీళ్లను చూపించింది... మానవత్వం ఆ కన్నీళ్లను తుడిచేందుకు ముందుకొచ్చింది." కథనాన్ని చదివి స్పందించిన తహశీల్దార్ వాణిరెడ్డికి మిర్రర్ కూడా సవినయంగా ప్రణామములు చెబుతోంది.

**"రజనీకి చేయూత... ఇద్దరు చిన్నారులకు భవిష్యత్తు."**

**కోసం ఇప్పటికే చాలా హృదయాలు స్పందించాయి.**

**"మిర్రర్ కథనానికి స్పందించిన ప్రతి హృదయానికి కుటుంబం సెల్యూట్ చేస్తోంది."**

---

# డీఆర్డీవో ఘన విజయం

### - క్షిపణి నిరోధక పరీక్షలు - స్వదేశీ సాంకేతికత సత్తా - రక్షణలో కీలక ముందడుగు



**న్యూఢిల్లీ, జూన్ 13**

భారత రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమిస్తూ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ విజయవంతంగా అత్యాధునిక క్షిపణి నిరోధక వ్యవస్థల పరీక్షలను నిర్వహించింది. జూన్ 10, 11 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో బాలిస్టిక్ క్షిపణుల ముప్పును ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు సముద్ర మార్గాల్లో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకునే ఆధునిక సాంకేతికతలను కూడా పరీక్షించారు. దేశ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ పరీక్షలు కీలక అడుగుగా నిలిచాయని రక్షణ శాఖ పేర్కొంది. ఈ ప్రయోగాల్లో భాగంగా మూడు రకాల విమాన ప్రయోగ పరీక్షలను నిర్వహించారు. ఇంటర్‌సెప్టర్ క్షిపణులను ప్రయోగించి నిర్దేశిత లక్ష్యాలపై వాటి సామర్థ్యాన్ని అంచనా వేశారు. అత్యంత వేగంగా దూసుకొచ్చే క్షిపణులను గుర్తించడం, వాటి కదలికలను పర్యవేక్షించడం, అనంతరం గాల్లోనే నిర్వీర్యం చేయడం వంటి కీలక దశలను విజయవం తంగా పరీక్షించినట్లు అధికారులు వెల్లడించారు. అన్ని లక్ష్యాలను ఖచ్చితంగా ఛేదించడం ద్వారా వ్యవస్థ పనితీరు నిరూపితమైందని తెలిపారు. ప్రపంచంలో కొద్ది దేశాలకే అందుబాటులో ఉన్న బాలిస్టిక్ క్షిపణి నిరోధక సామర్థ్యాన్ని భారత్ మరింత బలోపేతం చేసుకుందని రక్షణ శాఖ పేర్కొంది. ఖండాంతర క్షిపణుల నుంచి వచ్చే ముప్పును కూడా ఎదుర్కొనే దిశగా ఈ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది. ఆధునిక యుద్ధ పరిస్థితుల్లో దేశ భద్రతకు అత్యంత కీలకమైన ఈ సాంకేతికత భారత్‌ను రక్షణ రంగంలో అగ్రదేశాల సరసన నిలబెడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సముద్ర భద్రతను దృష్టిలో ఉంచుకొని నిర్వహించిన మధ్యశ్రేణి యాంటీ షిప్ క్షిపణి పరీక్ష కూడా విజయవంతమైంది. శత్రు నౌకలను ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకొని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ ప్రదర్శించినట్లు డీఆర్డీవో తెలిపింది. భవిష్యత్తులో సముద్ర సరిహద్దుల రక్షణలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించనుంది. భారత నౌకాదళానికి ఇది మరింత శక్తిని అందించడంతో పాటు సముద్ర మార్గాల్లో ఎదురయ్యే ముప్పులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచనుంది.

# జోర్‌హాట్‌లో విమాన ప్రమాదం

### - ల్యాండింగ్ వేళ ప్రమాదం - మంటల్లో ఏఎన్-32 విమానం



**గౌహతి, జూన్ 13**


భారతీయ వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం అస్సాంలోని జోర్‌హాట్ వైమానిక స్థావరంలో శనివారం ప్రమాదానికి గురైంది. ల్యాండింగ్ కోసం దిగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. విమానం నేలపైకి దిగే క్రమంలో అదుపు తప్పి కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదం అనంతరం విమానంలో భారీగా మంటలు చెలరేగడంతో వైమానిక స్థావరం పరిసరాల్లో అప్రమత్తత నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో ఎంతమంది ఉన్నారు, ఎవరికైనా గాయాలయ్యాయా లేదా అనే విషయాలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ఘటనకు గల కారణాలు ప్రస్తుతం తెలియరాలేదు. సాంకేతిక లోపమా, వాతావరణ పరిస్థితుల ప్రభావమా లేదా మరే ఇతర కారణమా అన్న దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని భారతీయ వైమానిక దళం తెలిపింది. ఏఎన్-32 విమానం భారత వైమానిక దళంలో అత్యంత కీలక రవాణా విమానంగా గుర్తింపు పొందింది. సోవియట్ యూనియన్ రూపకల్పన చేసిన ఈ విమానాన్ని భారత అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, ఎత్తైన ప్రాంతాలు, తీవ్ర ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాల్లో కూడా సమర్థంగా పనిచేసే సామర్థ్యం దీనికి ఉంది. సుమారు 7.5 టన్నుల సరుకును లేదా 50 మంది ప్రయాణికులను ఒకేసారి తరలించే సామర్థ్యాన్ని ఈ విమానం కలిగి ఉంది. భారత వైమానిక దళంలో ప్రస్తుతం వందకు పైగా ఏఎన్-32 విమానాలు సేవలందిస్తున్నట్లు సమాచారం. సరిహద్దు ప్రాంతాలు, దూర ప్రాంతాల్లో సైనిక సామగ్రి, ఆహార సరఫరా, సిబ్బంది రవాణా వంటి కీలక కార్యకలాపాల్లో ఈ విమానాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. అందుకే వీటిని వైమానిక దళానికి వెన్నెముకగా భావిస్తారు. ఇటీవల కూడా అస్సాంలోనే భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్-30 యుద్ధ విమానం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. వరుసగా అస్సాంలో వైమానిక దళ విమానాలకు ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజా ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

---

# బయట నుంచి చూస్తే సంఘ్‌ను అర్థం చేసుకోలేరు

### మోహన్ భాగవత్

**తిరువనంతపురం:**




రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అని, అయితే అత్యంత అపార్థానికి గురవుతున్న సంస్థ కూడా ఇదేనని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. స్వయం సేవకులు యూనిఫాంలో రూట్‌మార్చ్‌లు చేయడం, కర్రలతో ఎక్సర్‌సైజులు చేయడం చూసి పారామిలటరీ సంస్థ అని ఎవరైనా అనుకుంటే అది పొరపాటేనని అన్నారు. సంఘ్‌ను బయట నుంచి చూసి అర్థం చేసుకోవడం చాలా కష్టమని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేరళంలోని తిరువనంతపురంలో శనివారంనాడు జరిగిన ప్రబుద్ధ పౌర సంఘం (ప్రముఖ్ నాగరిక్ సంఘోష్టి) కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌ను బయట నుంచి చూసి అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా దానిని లోతుగా అర్థం చేసుకోవచ్చు. సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక ప్రత్యేక సందర్భం గురించి స్పందించే సంస్థ కాదని, అలాగే సమాజంలోని ఏ వర్గాన్ని కానీ, రాజకీయ పార్టీని కానీ వ్యతిరేకించే సంస్థ కూడా కాదని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్‌ను చెబుతున్నప్పటికీ అత్యంత అపార్థానికి గురవుతున్న సంస్థ కూడా ఇదేనని అన్నారు. ఈ అపోహాలు తొలగించేందుకే ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని భాగవత్ చెప్పారు. సమాజ సంక్షేమం, దేశ సేవ లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని, ఆ కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మళ్లీ గులాబీ జెండా లక్ష్యం

### ◆ కార్యకర్తలకు దిశానిర్దేశం ◆ డిజిటల్ సభ్యత్వానికి శ్రీకారం ◆ కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు




**వేములవాడ, జూన్ 13 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో నిర్వహించిన డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు జరిగిన ప్రయాణాన్ని గుర్తుచేశారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ నిలబడి ప్రజల మద్దతుతో విజయాలు సాధించిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలపై కూడా కేటీఆర్ స్పందించారు. వ్యవసాయ రంగంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం సరైన విధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితాల అంశాన్ని ప్రస్తావిస్తూ బూత్ స్థాయిలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో పార్టీకి మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేటీఆర్ ప్రస్తావించారు. వివాహ సహాయం, విద్యా సంస్థలు, వైద్య కళాశాలలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి అనేక కార్యక్రమాల ద్వారా తెలంగాణ అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ స్థాయి పనితీరు కనబరచలేకపోయిందని విమర్శించారు. ఈ నెల 25 తర్వాత వేములవాడ నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని సందర్శిస్తానని కేటీఆర్ ప్రకటించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను విజయపథంలో నడిపించి మళ్లీ గులాబీ జెండాను ఎగరవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి





**దుబ్బాక,జూన్ 13:( ది తెలంగాణ మిర్రర్ ) రిపోర్టర్ ప్రసాద్ గట్టు**
దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్ గ్రామంలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన కల్వకుంట ( మంగలి )భూపాల్ అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో అకస్మాత్తుగా విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ క్రమంలో కిందపడిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు అక్కడ మేత మేస్తున్న పాడి గేదెకు తగలడంతో, కరెంట్ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది.?రైతు భూపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు లక్ష రూపాయల విలువైన పాడి గేదె మరణించడంతో తన కుటుంబానికి పోషణ భారమై కోలుకోలేని ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. అధికారులు స్పందించి, విరిగిపోయిన కరెంట్ పోల్‌ను వెంటనే పునరుద్ధరించాలని మరియు నష్టపోయిన తమకు ప్రభుత్వం తరపున తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నారు.మృతి చెందిన పాడి గేదె రైతును గ్రామ సర్పంచ్ బాలేంల శ్రీలత రామచంద్రారెడ్డి ఓదార్చి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

# మధ్యాహ్న భోజన పథకం అమలుపై మార్గనిర్దేశం...

### పాఠశాల హెచ్‌ఎం, వంటశాల సిబ్బందితో శిక్షణ కార్యక్రమం



**హుస్నాబాద్ జూన్ 13 తెలంగాణ మిర్రర్**
హుస్నాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల కోసం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని హుస్నాబాద్ బాలుర జడ్పీ హైస్కూల్లో కాంప్లెక్స్ హెచ్‌ఎం కె. వాసుదేవ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా పాఠశాలలోని వంట పాత్రల పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నిల్వ విధానం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్యార్థులకు నాణ్యమైన మరియు పోషకాహారంతో కూడిన భోజనం తయారు చేసే విధానాలపై వంట కార్మికులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఆహారం తయారీ సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, వంట పాత్రలను పరిశుభ్రంగా నిర్వహించడం, తాగునీటి స్వచ్ఛత వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండల విద్యాధికారి బండారి మనీలా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత మరియు పోషకాహార ప్రమాణాల మెరుగుదలకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వంట కార్మికులు పాల్గొన్నారు.

# అమెరికా దాడులపై భారత్ ఆగ్రహం

**- జైశంకర్ తీవ్ర నిరసన - నావికుల మృతిపై ఆందోళన - ఇరాన్ ఆరోపణల ఖండన**



**న్యూఢిల్లీ, జూన్ 13**
ఒమన్ తీర ప్రాంతంలో భారతీయులు ఉన్న వాణిజ్య నౌకలపై జరిగిన దాడుల వ్యవహారం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనలపై భారత్ మరోసారి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. భారతీయుల ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సముద్ర వాణిజ్య మార్గాల్లో ప్రయాణించే నౌకల భద్రతకు భంగం కలిగించే చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతాయని భారత్ అభిప్రాయపడింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారతీయులు ఉన్న నౌకలపై జరిగిన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అమాయక నావికుల ప్రాణాలు బలిగొన్న ఘటన అత్యంత విచారకరమని పేర్కొంటూ, ఇలాంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదగినవి కావని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమ వేదికలో కూడా జైశంకర్ వెల్లడించారు. ఇటీవల గల్ఫ్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించడం దేశాన్ని కలచివేసింది. విదేశాల్లో విధులు నిర్వహిస్తున్న భారతీయుల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో దాడుల పూర్తి వివరాలను సేకరించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకునేలా అంతర్జాతీయ వేదికలపై ఒత్తిడి తీసుకురావాలని భారత్ భావిస్తోంది. ఈ ఘటనపై అమెరికాకు భారత్ అధికారికంగా కూడా తన అభ్యంతరాలను తెలియజేసింది. ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయ ప్రతినిధి జేసన్ మీక్స్‌ను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండుసార్లు పిలిపించి వివరణ కోరింది. భారతీయులు ఉన్న నౌకలపై దాడులు జరగడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. సముద్ర మార్గాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉందని పేర్కొంది. మరోవైపు ఈ దాడులకు ఇరాన్ కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భారతీయులు ఉన్న నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది ఇరానేనని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ వెంటనే ఖండించింది. తమపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని ప్రకటించింది. భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అమెరికాపై తీవ్ర విమర్శలు చేసింది. వారం రోజుల వ్యవధిలో మూడు నౌకలపై అమెరికా దాడులు జరిగాయని, వాటి కారణంగా ముగ్గురు అమాయక భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ విషాద ఘటనలపై వస్తున్న విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఇరాన్ ఆరోపించింది. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# అభిషేక్ ఇంట్లో సోదాలు

**- అర్ధరాత్రి తనిఖీలు కలకలం - టీఎంసీ నిరసనలు తీవ్రం - ఈడీ దాడులు కొనసాగింపు**

**కోల్‌కతా, జూన్ 13** తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు నిర్వహించిన సోదాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. భూ కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు నేపథ్యంలో కాళీఘాట్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న అధికారులు గంటల తరబడి తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సల్ట్‌లేని ప్రాంతానికి చెందిన భూ వ్యవహారంలో నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి కోసం గాలింపు చర్యల్లో భాగంగానే ఈ సోదాలు చేపట్టినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అభిషేక్ బెనర్జీ నివాసంలో సుమారు నాలుగు గంటలకు పైగా తనిఖీలు కొనసాగినట్లు సమాచారం. అయితే సోదాల సమయంలో కేంద్ర భద్రతా బలగాలు కూడా పాల్గొనడం రాజకీయ వివాదానికి కారణమైంది. అభిషేక్ నివాసం తాళాలు పగులగొట్టి అధికారులు లోపలికి ప్రవేశించారని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా ఈ ఘటనను పార్టీ నేతలు అభివర్ణించారు. సోదాల విషయం వెలుగులోకి రావడంతో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసనలు వ్యక్తం చేశారు.

# పిడుగుపాటుకు పాడిగేదె మృతి

**గాజులపల్లి లో జరిగిన సంఘటన,రైతు వెంకటేష్ కు రూ.1.10 లక్షల నష్టం**



**దౌల్తాబాద్, జూన్ 13( ది తెలంగాణ మిర్రర్ ):**
మండలంలోని గాజులపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున 4:40 గంటల సమయంలో పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన పాశం వెంకటేష్ కు చెందిన గేదె అక్కడికక్కడే చనిపోయింది. మృతిచెందిన పాడిగేదె విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. దీంతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు.

# ఏఈఓ సంతోష్‌కుమార్‌కు ఘన వీడ్కోలు



**దౌల్తాబాద్, జూన్ 13 ( ది తెలంగాణ మిర్రర్):**
దొమ్మాట క్లస్టర్ ఏఈఓ సంతోష్‌కుమార్ బదిలీపై పాపన్నపేట మండలానికి వెళుతున్న సందర్భంగా శనివారం దొమ్మాటలోని రైతు వేదికలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజిత వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని గత ఎనిమిదేళ్లుగా దొమ్మాట, సూరంపల్లి, గాజులపల్లి, ముత్యంపేట, లింగరాజుపల్లి గ్రామాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. రైతులతో సంతోష్‌కుమార్ ఏర్పరచుకున్న సత్సంబంధాలను గుర్తుచేసుకుంటూ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సింహాచలం, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు అహ్మద్,ప్రజాప్రతినిధులు, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# 130 కిలోమీటర్లు కారు నడిపిన విజయ్..

**మూకాంబిక అమ్మవారి దర్శనం**

**స్వయంగా డ్రైవ్ చేసిన సీఎం**

**అభిమానులకు అభివాదం**

**మంగళూరు, జూన్ 13**



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కర్ణాటకలోని మూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఆయన చేసిన ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భద్రతా సిబ్బంది, కాన్వాయ్ వెంట ఉన్నప్పటికీ స్వయంగా కారు నడుపుతూ మంగళూరు విమానాశ్రయం వరకు ప్రయాణించారు. మూకాంబిక ఆలయం నుంచి మంగళూరు విమానాశ్రయం వరకు సుమారు 130 కిలోమీటర్ల దూరాన్ని విజయ్ స్వయంగా డ్రైవ్ చేయడం చర్చనీయాంశమైంది. సాధారణంగా ముఖ్యమంత్రుల ప్రయాణాల్లో ప్రత్యేక డ్రైవర్లు ఉంటారు. అయితే విజయ్ స్వయంగా వాహనం నడపడం అభిమానులను ఆకట్టుకుంది. ఈ ప్రయాణంలో విజయ్ ధరించిన దుస్తులు కూడా అందరి దృష్టిని ఆకర్షించాయి. సూట్‌లో కనిపించిన ఆయన వినూత్న శైలిలో అభిమానులకు దర్శనమిచ్చారు. ప్రయాణం మొత్తం ఆయన ఉత్సాహంగా కనిపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. మార్గమధ్యంలోని ఓ టోల్‌గేట్ వద్ద కారు ఆపకుండా వాహనం నుంచే అభిమానులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. విజయ్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు రోడ్డు పక్కన వేచి ఉండగా, ఆయన వారికి చిరునవ్వుతో స్పందించారు. ఈ దృశ్యాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. మూకాంబిక అమ్మవారి ఆలయం దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు తరచూ ఈ ఆలయాన్ని సందర్శిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. విజయ్ కూడా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు సమాచారం. ఆలయ దర్శనం అనంతరం స్వయంగా వాహనం నడుపుతూ 130 కిలోమీటర్ల ప్రయాణం చేయడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సాధారణ వ్యక్తిలా కారు నడిపిన విజయ్ తీరు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.